సాక్షి సిద్దిపేట

శుక్రవారం। 3। ఫిబ్రవరి। 2023



పాత కక్షలతోనే హత్య 8లో..

మునిపల్లి మండలం బుదేరాలో జరిగిన హత్య కేసును పోలీసులు ఐదు రోజుల్లోనే ఛేదించారు. పాత కక్షలతోనే హత్య చేసినట్లు తేల్చారు.



నర్సాపూర్‌లో అవిశ్వాస కలకలం!

నర్సాపూర్ మున్సిపల్ చైర్మన్ మురళీయాదవ్‌పై అవిశ్వాస తీర్మానం పెట్టేందుకు బీఆర్ఎస్ నాయకులు పావులు కదుపుతున్నట్లు సమాచారం. 8లో..



కంటి వెలుగును పకడ్బందీగా నిర్వహించాలి 9లో..

కంటి వెలుగు కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహించాలని సిద్దిపేట మున్సిపల్ కమిషనర్ రవీందర్‌రెడ్డి సూచించారు.

న్యూస్‌రీల్

'కంటి వెలుగు'ను సద్వినియోగం చేసుకోవాలి

ఎఫ్‌డీసీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి



శిబిరాన్ని ప్రారంభిస్తున్న ప్రతాప్‌రెడ్డి

గజ్వేల్: 'కంటి వెలుగు'కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎఫ్‌డీసీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి పిలుపునిచ్చారు. గురువారం గజ్వేల్ – ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని 3వ వార్డులో కంటివెలుగు శిబిరాన్ని మున్సిపల్ చైర్మన్ ఎన్సీ రాజమౌళి, ఆత్మ కమిటీ చైర్మన్ ఊడెం కృష్ణారెడ్డిలతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రతాప్‌రెడ్డి మాట్లాడుతూ సీఎం కేసీఆర్ ప్రవేశపెట్టిన అద్భుత పథకాల్లో కంటి వెలుగు కూడా ఒకటన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ విద్యాధర్, వైస్ చైర్మన్ జకీయొద్దీన్, వార్డు కౌన్సిలర్ మర్కంటి వరలక్ష్మీకనకయ్య, టీఆర్ఎస్ గజ్వేల్ పట్టణ శాఖ అధ్యక్షుడు నవాజ్ మీరా తదితరులు పాల్గొన్నారు.

'పరిహారం ఇచ్చేవరకు పోరాటం ఆగదు'



నిరసన తెలుపుతున్న యువతులు

అక్కన్నపేట(హుస్నాబాద్):మండలంలోని గుడాటిపల్లి గ్రామం వద్ద నిర్మిస్తున్న గౌరవెల్లి ప్రాజెక్టులో ముంపునకు గురవుతున్న భూ నిర్వాసితుల పెళ్లయిన ఆడబిడ్డల ఆందోళన కార్యక్రమం గురువారం నాటికి 60 రోజులకు దాటింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పెళ్లయిన యువతులకు పరిహారం వచ్చేంతా వరకు దీక్షా శిబిరంలోనే కూర్చొని నిరసన తెలుపుతామని స్పష్టం చేశారు. పరిహారం విషయంలో అధికారులు, ప్రజాప్రతినిధులు రేపుమాపు అంటూ కార్యాలయాల చుట్టూ తిప్పుకుంటున్నారే తప్ప ఎటూ తేల్చడం లేదని మండిపడ్డారు. పరిహారం అందించడం లేదని వాపోయారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి వెంటనే ప్రతీ పెళ్లయిన ఆడబిడ్డలకు రూ.8 లక్షల చొప్పున పరిహారం చెల్లించాలన్నారు. చంటిపాపలతో దీక్ష శిబిరంలో ఆందోళన కార్యక్రమాలు చెబుతున్నా పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ నెల 6న ఈ విషయమై ఎమ్మెల్యే వొడితెల సతీష్‌కుమార్‌ను కలవనున్నట్లు తెలిపారు.

బెస్ట్ ఇంజినీర్‌గా శ్రీకాంత్‌వర్మ



సిద్దిపేటజోన్: ఇండియన్ కాంక్రీట్ ఇనిస్టిట్యూట్ వారి బెస్ట్ ఇంజనీర్ అవార్డు సిద్దిపేట పట్టణానికి చెందిన సివిల్ ఇంజనీర్ శ్రీకాంత్‌వర్మ ఎంపికయ్యారు. ఈ మేరకు గురువారం హైదరాబాద్‌లో జరిగిన ఒక కార్యక్రమంలో ఈ అవార్డును అందజేశారు. తనను ఎంపిక చేసిన ఇండియన్ కాంక్రీట్ ఇనిస్టిట్యూట్ ప్రతినిధులకు ఆయన కృతజ్ఞతలు తెలియజేశారు. నిర్మాణ రంగంలో ఇంకా గుణాత్మక మార్పులు తీసుకురావడానికి కృషి చేస్తానని పేర్కొన్నారు.

దక్షిణ భారత వైజ్ఞానిక ప్రదర్శనలో ఉత్తమ అవార్డు



అవార్డును అందుకుంటున్న రూపారాణి

కొండపాక(గజ్వేల్): దక్షిణ భారతదేశ వైజ్ఞానిక ప్రదర్శనలో సిరసనగండ్ల పాఠశాల ఉపాధ్యాయురాలు ప్రదర్శించిన ఎగ్జిబిట్‌కు ఉత్తమ అవార్డు లభించింది. జనవరి 31న కేరళలో జరిగిన ఈ ప్రదర్శనలో గణితం టీచర్ రూపారాణి జాయ్‌ఫుల్ లెర్నింగ్ అండ్ ఇన్నొవేటివ్ ఐడియాస్ అనే ఎగ్జిబిట్‌ను ప్రదర్శించింది. ఈ ప్రదర్శనకుగాను భారత ప్రభుత్వ మినిస్ట్రీ ఆఫ్ కల్చర్ విశ్వేశ్వరయ్య ఇండస్ట్రియల్ టెక్నాలజీకల్ మ్యూజియంలో ఈ అవార్డును అందజేశారు. ఈ పురస్కారాన్ని అందుకోవడంపై డీఈఓ శ్రీనివాస్‌రెడ్డి, ఎంఈఓ శ్రీనివాస్‌రెడ్డి, ఎస్సీఈఆర్టీ ప్రతినిధులు సురేశ్‌బాబు అభినందించారు.

2,441 దరఖాస్తులు

బదిలీకి ఉపాధ్యాయుల వినతి

- 1,078 మందికి ట్రాన్స్‌ఫర్ తప్పనిసరి
- అదనంగా మరో 1,363 అప్లికేషన్స్
- 6వ తేదీ వరకు హార్డ్ కాపీల స్వీకరణ
- ముమ్మరంగా సాగుతున్న ప్రక్రియ



సిద్దిపేట ఎంఈఓ కార్యాలయంలో దరఖాస్తుల ధ్రువపత్రాలను అందజేస్తున్న ఉపాధ్యాయులు

సాక్షి, సిద్దిపేట: జిల్లా వ్యాప్తంగా ఉపాధ్యాయ బదిలీల కోసం 2,441 మంది దరఖాస్తు చేసుకున్నారు. ఈ నెల 1వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో అప్లికేషన్లను స్వీకరించిన విషయం తెలిసిందే. అలాగే దరఖాస్తుల్లో ఏవైనా తప్పిదాలు జరిగినా, సంబంధిత సర్టిఫికెట్లు అప్లోడ్ చేయకున్నా వాటిని మళ్లీ కరెక్ట్ చేసుకునేందుకు 1వ తేదీ వరకు ఎడిట్ ఆప్షన్ ఇచ్చారు. కొందరు ఉపాధ్యాయులు ఈ అవకాశాన్ని వినియోగించుకుని సరిచేసుకున్నారు. దరఖాస్తుదారుల నుంచి ఈ నెల 6వ తేదీ వరకు హార్డ్ కాపీలను స్వీకరించనున్నారు. ఇప్పటికే పలువురు ఉపాధ్యాయులు వారి బదిలీలకు సంబంధించిన పత్రాలను ఆయా ఎంఈఓ కార్యాలయాల్లో అందజేశారు.

- ఎనిమిదేళ్లుగా పని చేస్తున్న ఉపాధ్యాయుల 1,078 మంది విధిగా బదిలీలు కానున్నారు. ఇందులో ఎస్‌జీటీలు 669, స్కూల్ అసిస్టెంట్‌లు 340, హెచ్‌ఎంలు 69 మంది ఉన్నారు. వీళ్లతో పాటు రెండేళ్లు ఒకే చోట పని చేస్తున్నవారికి సైతం ట్రాన్స్‌ఫర్ చేసుకునేందుకు అవకాశం కల్పించారు. దీంతో అదనంగా మరో 1,363 మంది ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్నారు.
- ఈ బదిలీల్లో 140 మంది దివ్యాంగ టీచర్లు, వివిధ ఆరోగ్య సమస్యలతో వారితో పాటు, వారి కుటుంబ సభ్యులు ఉన్న వారు 85 మంది ఇప్పటికే జనరల్ ఆస్పత్రి నుంచి సంబంధిత ధ్రువపత్రాలను తీసుకున్నారు. దీంతో వారికి మొదటి ప్రాధాన్యత ఇవ్వనున్నారు.
- ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న వారు అన్ని పత్రాలను సంబంధిత కాంప్లెక్స్ హెడ్‌మాస్టర్లు, ఎంఈఓల ద్వారా ఈ నెల 6వ తేదీలోగా డీఈఓ కార్యాలయానికి పంపించాల్సి ఉంటుంది.
- 7, 8 తేదీల్లో ఉపాధ్యాయుల సీనియారిటీ జాబితాను విడుదల చేయనున్నారు.
- 8 నుంచి 10వ తేదీ వరకు అభ్యంతరాల స్వీకరణ, పరిశీలన పరిష్కరించనున్నారు.
- తొలుత 14న హెడ్మాస్టర్ల బదిలీల ప్రక్రియ, 16 నుంచి 18 వరకు స్కూల్ అసిస్టెంట్లకు హెడ్మాస్టర్లుగా పదోన్నతులు కల్పించనున్నారు. 22 నుంచి 23 వరకు స్కూల్ అసిస్టెంట్‌ల బదిలీలు, మార్చి 4న ఎస్జీటీల బదిలీలు పూర్తి కానున్నాయి.

అంతా ఆన్‌లైన్ ద్వారానే..



బదిలీకి దరఖాస్తు చేసుకున్న ఉపాధ్యాయులు దరఖాస్తు హార్డ్ కాపీలను 6వ తేదీ వరకు అందజేయాలి. వాటిని పరిశీలించి 7,8 తేదీల్లో సీనియారిటీ జాబితాను ప్రకటిస్తాం. బదిలీల ప్రక్రియ అంతా ఆన్‌లైన్ ద్వారానే జరుగుతుంది.

– శ్రీనివాస్‌రెడ్డి, డీఈఓ

భాషా పండితులు, పీఈటీలకు పదోన్నతులు ఇవ్వాలి



భాషా పండితులు, పీఈటీలు అప్‌గ్రేడేషన్ కోర్టు కేసుల వలన నిలిచిపోయింది. వారికి కూడా పదోన్నతి కల్పించి న్యాయం చేయాలి. అసెంబ్లీ సాక్షిగా సీఎం కేసీఆర్ ప్రకటించిన ఐదువేల ప్రైమరీ హెచ్‌ఎంలకు కూడా ఈ పదోన్నతుల ద్వారా భర్తీ చేయాలి. పెద్ద ఎత్తున బదిలీలు, పదోన్నతులు కల్పిస్తున్న ముఖ్యమంత్రికి ధన్యవాదాలు.

– ఏ. శశధర్‌శర్మ, పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు

ఉద్యోగమే లక్ష్యంగా చదవండి



అభ్యర్థులతో మాట్లాడుతున్న పోలీస్ కమిషనర్ శ్వేత

పోలీస్ కమిషనర్ శ్వేత

సిద్దిపేటజోన్: అభ్యర్థులు ఉద్యోగమే లక్ష్యంగా చదవాలని సిద్దిపేట పోలీస్ కమిషనర్ శ్వేత సూచించారు. గురువారం స్థానిక బీజేఆర్ భవన్‌లో ఏర్పాటు చేసిన ఉచిత పోలీస్ శిక్షణ శిబిరాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె యువతతో లక్ష్యం, ఉద్యోగ సాధన, పట్టుదల తదితర అంశాలపై దిశా నిర్దేశం చేశారు. మంత్రి హరీశ్‌రావు ప్రత్యేక శ్రద్ధతో ఉచితంగా ఈ శిక్షణ ఇస్తున్నామని దీన్ని సార్థకత చేసుకోవాలని సూచించారు. కేవలం 80 రోజులు కష్టపడితే ఉద్యోగం పక్కా అని పేర్కొన్నారు. సమయం వృథా చేయకుండా, కష్టపడాలని పేర్కొన్నారు. ప్రభుత్వం 7 మార్కులను కలిపిన తర్వాత క్వాలిఫై అయిన వారికి ఉచితంగా శారీరక దృఢత్వ శిక్షణ శిబిరాలు సిద్దిపేట, గజ్వేల్‌లో ఇవ్వడం జరుగుతుందన్నారు. ఆసక్తి ఉన్న వారు ఈనెల 6న సిద్దిపేట డిగ్రీ కళాశాల, గజ్వేల్‌లోని ఇంటిగ్రేటెడ్ కార్యాలయం వెనుక భాగాన గ్రౌండ్ లో ఉదయం 6 గంటల వరకు హాజరు కావాలని సూచించారు. మరిన్ని వివరాలకు సిద్దిపేట వినోద్ 9182103730, గజ్వేల్ బాలకష్ణ 7993782433 నంబర్లు సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో రిజర్వ్ ఇన్స్పెక్టర్ ధరణి, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

నేడు మల్లన్న సాగర్ నీటి విడుదల

మెదక్ ఎంపీ ప్రభాకర్‌రెడ్డి

తొగుట(దుబ్బాక): రైతుల విజ్ఞప్తి మేరకు సీఎం కేసీఆర్, మంత్రి హరీశ్‌రావు ఆదేశాల మేరకు శుక్రవారం (3వ తేదీన) ఉదయం 8.30 గంటలకు కొడకండ్ల వద్ద మల్లన్నసాగర్ నుంచి నీటిని కూడవెల్లి వాగులోకి వదలనున్నట్టు మెదక్ ఎంపీ ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. గురువారం ఆయన ఢిల్లీ నుంచి స్థానిక విలేకరులతో మాట్లాడారు. రైతు సంక్షేమం సీఎం కేసీఆర్‌తోనే సాధ్యమవుతుందన్నారు. కూడవెల్లి వాగు పరిసర ప్రాంతంలో యాసంగిలో పెద్ద ఎత్తున వరిసాగు చేశారని చెప్పారు. వాగులో నీటి మట్టం తగ్గిపోవడంతో పంట ఎండిపోయే అవకాశం ఉందన్నారు. ఈ నేపథ్యంలో రైతులు సాగుచేసిన వరి పంట కాపాడేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టిందన్నారు. మల్లన్న సాగర్ కాల్వల నిర్మాణం పూర్తయితే చెరువులు, కుంటల్లోకి నీటిని విడుదల చేయడం జరుగుతుందన్నారు. కొడకండ్ల వద్ద నీటిని విడుదల చేసే కార్యక్రమానికి గజ్వేల్, దుబ్బాక నియోజకవర్గాల ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు భారీ సంఖ్యలో తరలి రావాలని కోరారు.

షీ టీమ్స్‌తో మహిళలకు భరోసా

సిద్దిపేటకమాన్: షీ టీమ్స్‌తో మహిళలకు భరోసా కల్పించనున్నట్లు పోలీస్ కమిషనర్ ఎన్.శ్వేత తెలిపారు. విద్యార్థులకు ర్యాగింగ్, ఈవ్ టీజింగ్, పోక్సో, యాంటీ హ్యూమన్ ట్రాఫికింగ్‌పై అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. గురువారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ డివిజన్ల వారిగా షీ టీమ్స్ ఏర్పాటు చేశామన్నారు. మహిళలకు ఇబ్బందులు ఎదురైతే ఫిర్యాదు చేయాల్సిన నంబర్లపై బస్టాండ్, సినిమా హాళ్లు, పాఠశాలలు, కళాశాలల్లో క్యూఆర్ స్కానింగ్ పోస్టర్లను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. అత్యవసర పరిస్థితుల్లో డయల్ 100, షీటీమ్ వాట్సప్ నంబర్ 7901640473, పోలీస్ కంట్రోల్ నంబర్ 8333998699 ఫోన్ చేసి ఫిర్యాదు చేయాలని కోరారు. సీఐ దుర్గా ఆధ్వర్యంలో షీటీమ్స్ బృందాలు పని చేస్తున్నట్లు తెలిపారు. గత నెలలో 17మంది ఈవ్ టీజర్స్‌ను పట్టుకొని కౌన్సెలింగ్ నిర్వహించినట్లు తెలిపారు. అలాగే 12 మందిపై ఈ- పెట్టి కేసులు నమోదు చేశామన్నారు. ఎస్ఐ సాంబయ్య, ఏఎస్ఐలు అమృత్, ముజీబ్, హెడ్ కానిస్టేబుల్ సంజీవరెడ్డి, మహిళ కానిస్టేబుల్స్ పద్మ, సంగీత, జ్యోతి, రజిత, కానిస్టేబుళ్లు స్వామి, ప్రకాష్, రవి, యుగేందర్, అన్వేష్, దుద్యానాయక్ విధులు నిర్వహిస్తున్నారని పేర్కొన్నారు.

ఆశ వర్కర్లకు ఫిక్స్‌డ్ వేతనం చెల్లించాలి



మెడికల్ ఆఫీసర్‌కు వినతిపత్రం ఇస్తున్న ఆశ వర్కర్లు

దుబ్బాకరూరల్: ఆశ వర్కర్లకు ఫిక్స్‌డ్ వేతనం చెల్లించాలని డిమాండ్ చేస్తూ సీఐటీయూ ఆధ్వర్యంలో మండలంలోని తిమ్మాపూర్, రామక్కపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల ఎదుట గురువారం ఆందోళన చేశారు. ఆశ వర్కర్లకు ఫిక్స్‌డ్ వేతనం చెల్లించాలని మెడికల్ ఆఫీసర్లకు వినతిపత్రం అందజేశారు. రాష్ట్ర కమిటీ సభ్యుడు భాస్కర్ మాట్లాడుతూ రాష్ట్రంలో సుమారుగా 26 వేలు మంది ఆశ వర్కర్లు పని చేస్తున్నారన్నారు. 18 ఏళ్లుగా పేద ప్రజలకు సేవలు అందిస్తున్నారని తెలిపారు. పారితోషికాలు లేని అనేక అదనపు పనులు ఆశలు చేస్తున్నారన్నారు. పెన్షన్, ఈఎస్ఐ, ఉద్యోగ భద్రత, కనీసం ప్రసూతి సెలవులు కూడా ప్రభుత్వం నిర్ణయించలేదన్నారు. ఆంధ్ర రాష్ట్రంలో ఆశలకు రూ.10 వేలు ఫిక్స్‌డ్ వేతనం ఇస్తున్నట్లుగా మన రాష్ట్రంలో కూడా ఫిక్స్‌డ్ వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఆశ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు మంజుల, శ్యామల, భాగ్యలక్ష్మి, సంతోష, లత, శోభ, భారతి, దేవలక్ష్మి, రజిత, మమత తదితరులు పాల్గొన్నారు.

త్వరగా వసతులు కల్పించాలి



పనులను పరిశీలిస్తున్న కలెక్టర్ ప్రశాంత్‌జీవన్ పాటిల్

- కలెక్టర్ ప్రశాంత్ జీవన్‌పాటిల్
- ఆర్అండ్ఆర్ కాలనీలో సమస్యల పరిశీలన, పరిష్కారానికి ఆదేశాలు

గజ్వేల్: గజ్వేల్- ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీలోని మల్లన్నసాగర్ నిర్వాసిత కాలనీ(ఆర్అండ్ఆర్)లో సౌకర్యాల కల్పనను మార్చి నెలాఖరులోగా పూర్తి చేయాలని కలెక్టర్ ప్రశాంత్‌జీవన్‌పాటిల్ ఆదేశించారు. గురువారం అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, గజ్వేల్, సిద్దిపేట ఆర్డీఓలు విజయేందర్‌రెడ్డి, అనంతరెడ్డితో ఆర్అండ్ఆర్ కాలనీలో విస్తృతంగా పర్యటించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ముంపు బాధితుల సమస్యల పరిష్కారానికి యుద్ధ ప్రతిపాదికన చర్యలు చేపడతామన్నారు. పెండింగ్ అంశాలను ఒకొక్కటిగా పరిశీలించి పరిష్కారానికి అవసరమైన కార్యాచరణతో ముందుకు సాగుతామన్నారు. ఓపెన్ ప్లాట్లు ఇచ్చిన చోట రోడ్లు, విద్యుత్ కనెక్షన్‌లు, మిషన్ భగీరథ నల్లా కనెక్షన్లు పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. కాలనీలో హరితహారం కింద మొక్కలు నాటేందుకు అవసరమైన ప్రణాళికను కూడా సిద్ధం చేయాలన్నారు. ప్రస్తుతం చేపడుతున్న పనుల ప్రగతిని ఎప్పటికప్పుడు తనకు తెలియజేస్తూనే గడువులోగా పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో ఈడబ్ల్యూఐడీసీ ఈఈ శ్రీనివాస్‌రెడ్డి, డీఈ మధుసూదన్, మిషన్ భగీరథ డీఈ సుమలత తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి హామీని ఎత్తేసే కుట్రలో కేంద్రం



బడ్జెట్ ప్రతులను దగ్ధం చేస్తున్న నాయకులు

సిద్దిపేటఅర్బన్: ఉపాధి హామీని ఎత్తేసే కుట్రలో భాగంగానే కేంద్ర ప్రభుత్వం బుధవారం నిధుల్లో కోత పెట్టిందని సీఐటీయూ జిల్లా కార్యదర్శి గోపాలస్వామి, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి శశిధర్ ఆరోపించారు. దీనికి నిరసనగా గురువారం ప్రజా సంఘాల ఆధ్వర్యంలో సిద్దిపేటలో బడ్జెట్ ప్రతులను దగ్ధం చేసి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ వల్ల పేదల ఆహార భద్రతకు ముప్పు కలిగే అవకాశం ఉందన్నారు. తగ్గిన నిధులతో కూలీలకు కనీస పని దినాలు కల్పించే పరిస్థితి ఉండదన్నారు. పోరాడి సాధించుకున్న ఉపాధి హామీ చట్టానికి తూట్లు పొడుస్తున్నారని అన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి రవికుమార్, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు అరవింద్, నాయకులు శిరీష, నవీన్, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

భాషా పండితులకు పదోన్నతులు కల్పించాలి



వినతి పత్రాలు చూపిస్తున్న ఉపాధ్యాయులు

చేర్యాల(సిద్దిపేట): ఉపాధ్యాయుల బదిలీల్లో భాగంగా భాషా పండితులు, పీఈటీలకు పదోన్నతులు కల్పించాలని రాష్ట్రీయ ఉపాధ్యాయ పండిత్ పరిషత్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుళ్లపల్లి తిరుమల క్రాంతికృష్ణ కోరారు. గురువారం గెజిటెడ్ ప్రధానోపాధ్యాయ సంఘం మండల అధ్యక్షుడు డింగి నరేందర్‌కు సహాయ నిరాకరణ పత్రాన్ని అందించారు. అనంతరం మాట్లాడుతూ ఇటీవల ప్రభుత్వం విడుదల చేసిన షెడ్యూల్‌లో భాషా పండిత్, పీఈటీలకు అవకాశం కల్పించకపోవడం బాధాకరమన్నారు. పండిత్, పీఈటీల ఐక్యవేదిక ఇచ్చిన పిలుపు మేరకు న్యాయమైన డిమాండ్ నెరవేర్చాలని కోరుతూ కేవలం 6, 7, 8 తరగతులకు మాత్రమే పాఠాలు బోధించి 9, 10 తరగతులకు వెళ్లకుండా ఫిబ్రవరి 1 నుంచి సహాయ నిరాకరణ చేస్తున్నామన్నారు. ఇప్పటికైనా స్పందించి న్యాయమైన డిమాండ్ నెరవేర్చాలని కోరారు. ఆయన వెంట సంఘం ప్రతినిధులు ధర్మారెడ్డి, నవీన్, శ్రీనివాస్, మల్లయ్య, శ్రీనివాస్, శ్రీనివాస్, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

ఇంకా పెండింగ్‌లోనే..

- ముందుకుసాగని విలీన గ్రామాల ప్రతిపాదన
- ఆమోదం కోసం రెండేళ్లుగా ఎదురుచూపులు
- గజ్వేల్, ప్రజ్ఞాపూర్‌లో పూర్తి కావొస్తున్న యూజీడీ పనులు



గజ్వేల్-ప్రజ్ఞాపూర్‌లో యూజీడీ పనులు

గజ్వేల్: గజ్వేల్ – ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని విలీన గ్రామాల్లో చేపట్టాల్సిన అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ (యూజీడీ) పనుల ప్రతిపాదన ముందుకు కదలడం లేదు. ప్రస్తుతం మున్సిపాలిటీ పరిధిలోని గజ్వేల్, ప్రజ్ఞాపూర్‌లలో రూ.100 కోట్లతో 90 కి.మీకుపైగా పనులు చివరి దశకు చేరాయి. రెండో విడతలో మరో రూ.49 కోట్ల వ్యయంతో విలీన గ్రామాలైన ముట్రాజ్‌పల్లి, క్యాసారం మధిర గ్రామాలైన రాజిరెడ్డిపల్లి, సంగాపూర్, సంగుపల్లిల్లో పనులు చేపట్టడానికి ప్రతిపాదనలు పంపించారు. రెండేళ్లు గడుస్తున్నా..ఈ వ్యవహారంలో చడీచప్పుడులేదు.

80వేలకు చేరిన జనాభా

ఈ విలీన గ్రామాల్లో 11,500 ఇళ్లు ఉన్నాయి. కొత్తగా చేరిన ఆర్అండ్ఆర్ కాలనీలతో కలుపుకొని ప్రస్తుతం మున్సిపాలిటీ జనాభా 80వేలకు పైగా చేరుకుంది. అభివృద్ధికి నమూనాగా మారినా డ్రైనేజీ వ్యవస్థ మాత్రం చిన్నాభిన్నంగా మారింది. ఈ నేపథ్యంలో 2018లో మొక్కలు నాటే కార్యక్రమానికి వచ్చిన సీఎం కేసీఆర్ ఎస్‌డీఎఫ్(స్పెషల్ డెవలప్‌మెంట్ ఫండ్) ద్వారా రూ.100 కోట్ల నిధులు మంజూరు చేయడంతో సమస్యల పరిష్కారానికి అవకాశం కలిగింది. ఇందులో భాగంగానే 90 కిలోమీటర్ల మేర భూగర్భ మురుగునీటి పైప్‌లైన్ వ్యవస్థతో పాటు నాలుగు చోట్ల ఎస్‌టీపీ(సేవరేజ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్)లను నిర్మించారు. ప్రస్తుతం 90కిలోమీటర్లకుపైగా భూగర్భ మురుగు పైప్‌లైన్ వ్యవస్థ నిర్మాణం గజ్వేల్, ప్రజ్ఞాపూర్‌లలోనే పూర్తి కావచ్చింది.

జాప్యంపై మండిపాటు

మున్సిపాలిటీలోని విలీన గ్రామాలైన ముట్రాజ్‌పల్లి, క్యాసారం మధిర గ్రామాలైన రాజిరెడ్డిపల్లి, సంగాపూర్, సంగుపల్లిలో రెండో విడతలో పనులు చేపట్టడానికి నిర్ణయించారు. సుమారు 40కిలోమీటర్లకు పైగా ఆయా గ్రామాల్లో భూగర్భ మురుగునీటి వ్యవస్థ అవసరమని గుర్తించారు. ఇందుకు రూ.49 కోట్లు అవసరమని ఇప్పటికే ప్రతిపాదనలు సిద్ధం చేశారు. కానీ ఆమోదానికి రెండేళ్లుగా నిరీక్షించాల్సి వస్తుంది. తమ గ్రామాల్లో పనులు ఎందుకు జాప్యం చేస్తున్నారని ప్రజలు మండిపడుతున్నారు. సకాలంలో నిధులు రాబట్టడంలో మున్సిపల్ పాలకవర్గం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

త్వరలోనే ఆమోదం లభించే అవకాశం



గజ్వేల్- ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని విలీన గ్రామాలకు సంబంధించి ప్రతిపాదనలకు త్వరలోనే ఆమోదం లభించే అవకాశముంది. నిధులు విడుదల కాగానే పనులు ప్రారంభవముతాయి. దీని కోసమే ఎదురుచూస్తున్నాం.

– ముత్యంరెడ్డి, 'గడా' ప్రత్యేకాధికారి

క్లుప్తంగా

అసైన్డ్ భూములపై హక్కులు కల్పించాలి

అసైన్డ్ ల్యాండ్ ఓనర్స్ వెల్ఫేర్ రాష్ట్ర అధ్యక్షుడు శివయ్య

కల్హేర్(నారాయణఖేడ్): అసైన్డ్ భూములకు పట్టా భూములతో సమానంగా హక్కులు కలిృంచాలని అసైన్డ్ ల్యాండ్ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ఎర్రోళ్ల శివయ్య ప్రభుత్వాన్ని కోరారు. గురువారం కల్హేర్‌లో అసైన్డ్ ల్యాండ్ గ్రామ కమిటీ సభ్యులు, రైతులతో సమావేశం ఏర్పాటు చేశారు. నూతనంగా మండల కమిటీ ఎన్నుకున్నారు. మండల కమిటీ అధ్యక్షుడిగా సీతారాం హన్మండ్లు, తదితరులను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ రాష్ట్ర నాయకులు డేవిడ్, రాజుకుమార్, మండల బాధ్యులు మాణిక్యం, కుమ్మరి సంజీవులు, ప్రకాశ్, పాల్గొన్నారు.

రాజిరెడ్డికి ప్రశంసపత్రం అందజేత

మెదక్ కలెక్టరేట్: ఓటర్ల నమోదుకు కృషి చేసి రాష్ట్ర స్థాయిలో స్పెషల్ కేటగిరీ అవార్డుకు ఎంపికైన స్వీప్ నోడల్ అధికారి రాజిరెడ్డికి జిల్లా కలెక్టర్ రాజర్షిషా ప్రశంస పత్రం అందజేశారు. రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి కార్యాలయం ద్వారా అందించబడిన ప్రశంస పత్రం, జ్ఞాపిక, నగదు పురస్కారాన్ని కలెక్టర్ గురువారం తన చాంబర్ లో అందజేశారు. రాష్ట్ర స్థాయిలో జిల్లాకు గుర్తింపు తెచ్చినందుకు కలెక్టర్ అభినందించారు.

వసతిగృహాల సందర్శన

సిద్దిపేటఎడ్యుకేషన్: జిల్లా కేంద్రంలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ కాలేజీ హాస్టల్స్‌ను బుధవారం రాత్రి సిద్దిపేట ప్రభుత్వ బాలుర కళాశాల ప్రిన్సిపాల్ శాడ సత్యనారాయణరెడ్డి సందర్శించారు. ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షలు సమీపిస్తున్న నేపథ్యంలో విద్యార్థులు చదువుతున్నారా లేదా అనే విషయాన్ని ప్రత్యక్షంగా తెలుసుకునేందుకు హాస్టల్స్‌ను ఆకస్మికంగా సందర్శించినట్లు చెప్పారు.ఆయన వెంట కామర్స్ అధ్యాపకుడు గంగాధర్ టున్నారు.

విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ధ్వంసం

కొల్చారం(నర్సాపూర్): గుర్తు తెలియని వ్యక్తులు విద్యుత్ ట్రాన్స్ ఫార్మర్ ధ్వంసం చేసి, విలువైన పరికరాలను ఎత్తుకెళ్లారు. ఈ సంఘటన కొల్చారం మండలం ఎనగండ్ల గ్రామ శివారులో గురువారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. గ్రామంలోని ఎల్లమ్మ దేవాలయం సమీపంలో రైతులు వ్యవసాయ బోర్ల కోసం విద్యుత్ ట్రాన్స్ ఫార్మర్‌ను ఏర్పాటు చేసుకున్నారు. మధ్యాహ్నం అటుగా వెళ్లిన రైతులు ట్రాన్స్ ఫార్మర్ విడిభాగాలు చెల్లాచెదురుగా పడి ఉండటం గమనించారు. దీంతో ట్రాన్స్ కో ఏఈకి ఫిర్యాదు చేశారు.

రాష్ట్ర బడ్జెట్‌లో అధిక నిధులు కేటాయించాలి

ఏఐఎస్‌బీ జిల్లా అధ్యక్షుడు వేణు

చేర్యాల(సిద్దిపేట): రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టనున్న బడ్జెట్‌లో విద్యారంగానికి అధిక నిదులు కేటాయించి ప్రాధాన్యత కల్పించాలని ఏఐఎస్‌బీ జిల్లా అధ్యక్షుడు పుల్లని వేణు విజ్ఞప్తి చేశారు. గురువారం పట్టణ కేంద్రంలో విలేకరులతో మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రవేశ పెట్టే వార్షిక బడ్జెట్‌లో విద్యారంగానికి తగినన్ని నిధులు కేటాయించకుండా విస్మరిస్తున్నాయన్నారు. కొఠారి కమిషన్ సిఫార్సు ప్రకారం కేంద్ర బడ్జెట్‌లో 10 శాతం, రాష్ట్ర బడ్జెట్‌లో 30 శాతం నిధులు కేటాయించాల్సి ఉన్నా అందుకు విరుద్ధంగా కేటాయిస్తున్నారని విమర్శించారు. రాబోయే బడ్జెట్‌లోనైనా రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగానికి 30 శాతం నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు.


మాట్లాడుతున్న వేణు

నర్సాపూర్‌లో అవిశ్వాస కలకలం

- మున్సిపల్ చైర్మన్ బీజేపీలో చేరడంతో మారిన రాజకీయం
- సీఎం కేసీఆర్, మంత్రులపై విమర్శలు చేయడంపై సీరియస్
- విప్ జారీచేయాలని మంతనాలు
- త్వరలో అవిశ్వాసం నోటీసు ఇవ్వాలని నిర్ణయం


నర్సాపూర్ పురపాలక కార్యాలయ భవనం

నర్సాపూర్: నర్సాపూర్ మున్సిపల్ చైర్మన్ మురళీయాదవ్‌పై అవిశ్వాస తీర్మానం పెట్టేందుకు బీఆర్ఎస్ పార్టీ పావులు కదుపుతున్నట్లు తెలిసింది. మురళీయాదవ్ బీఆర్ఎస్ నుంచి గెలిచి ఇటీవల బీజేపీలో చేరడంతో సీఎం కేసీఆర్‌తో పాటు బీఆర్ఎస్‌కు చెందిన మంత్రులు, ఇతర నాయకులపై విమర్శలు గుప్పిస్తున్నారు. దీంతో అతడిని పదవీ చ్యుతుడిని చేయాలని బీఆర్ఎస్ అధిష్టానం నిర్ణయించినట్లు సమాచారం. అందులో భాగంగా గురువారం ఉదయం రాష్ట్ర మంత్రి హరీశ్‌రావు నర్సాపూర్‌కు చెందిన రాష్ట్ర మహిళ కమిషన్ చైర్‌పర్సన్ సునీతారెడ్డి, ఎమ్మెల్యే చిలుములమదన్‌రెడ్డిలతో పాటు కౌన్సిలర్లను తన నివాసానికి పిలిపించుకుని అవిశ్వాసంపై స్థానిక నాయకులకు పలు సూచనలు చేసినట్ల వినికిడి. మంత్రిని కలిసిన వారిలో మదన్‌రెడ్డి, సునీతారెడ్డిల ఆధ్వర్యంలో మున్సిపాలిటీ వైస్ చైర్మన్ నయిమొద్దీన్, బీఆర్ఎస్ కౌన్సిలర్లు అశోక్‌గౌడ్, ఇష్రత్‌సిద్ధిఖా, రుక్కమ్మ, సరిత, పంబాల లలిత, ఇండిపెండెంట్ కౌన్సిలర్లు రాంచందర్, కుమ్మరి లక్ష్మి ఉన్నట్లు స్థానిక నాయకులు చర్చించుకుంటున్నారు. కాగా చైర్మన్‌పై అవిశ్వాసం నోటీసు ఎప్పుడు ఇవ్వాలి, నోటీసు ఇచ్చిన అనంతరం తీసుకోవల్సిన చర్యలపై మంత్రితో సు. దీర్ఘంగా చర్చించినట్లు తెలిసింది. నర్సాపూర్ మున్సిపాలిటీలో 15 కౌన్సిలర్ స్థానాలు ఉన్నాయి. ఎన్నికలపుడు బీఆర్ఎస్(అప్పుడు టీఆర్ఎస్) నుంచి ఎనిమిది మంది కౌన్సిలర్లు గెలుపొందగా బీజేపీ నుంచి కౌన్సిలర్లు, ఇండిపెండెంట్లుగా ముగ్గురు గెలిచారు. మున్సిపల్ చైర్మన్ పదవికి ఎన్నిక సమయంలో ముగ్గురు ఇండిపెండెంట్లు బీఆర్ఎస్‌కు అనుకూలంగా ఓటు వేశారు. అనంతరం వారు ఏ పార్టీలో చేరక పోయినా మురళీయాదవ్ పార్టీని వీడె వరకు వారు బీఆర్ఎస్‌కు అనుకూలంగా వ్యవహరించారు. చైర్మన్ బీజేపీలో చేరడంతో 4వ వార్డు బీఆర్ఎస్ కౌన్సిలర్ ఎరుకల యాదగిరి, 2 వార్డు నుంచి ఇండిపెండెంట్‌గా గెలుపొందిన లత చైర్మన్‌తో పాటు బీజేపీలో చేరారు. మున్సిపల్ ఎన్నికలలో బీజేపీ నుంచి పోటీ చేసి నలుగురు కౌన్సిలర్లు గెలుపొందిన కౌన్సిలర్లు ఉండగా చైర్మన్‌తో పాటు ఇద్దరు కౌన్సిలర్లు బీజేపీలో చేరడంతో మున్సిపాలిటీలో బీజేపీ సంఖ్య చైర్మన్‌తో కలిపి ఏడుకు చేరింది. ఇదిలాఉండగా చైర్మన్‌పై బీఆర్ఎస్ అవిశ్వాసం పెడుతున్నందున తీర్మానంపై ఓటు వేసే సమయంలో పార్టీ విప్ జారి చేసే అంశంపై సైతం మంత్రి వద్ద చర్చించారని తెలిసింది. త్వరలో అవిశ్వాసం నోటీసు ఇవ్వాలని నిర్ణయించారని విశ్వసనీయ సమాచాం. చైర్మన్‌పై అవిశ్వాసం పెడితే బీఆర్ఎస్‌కు స్థానిక ఎమ్మెల్యే ఓటు సైతం ఉండటంతో అవిశ్వాసం నెగ్గే అవకాశం ఉంటుందని బీఆర్ఎస్ నాయకులు అభిప్రాయపడుతున్నారు.

దళిత జనాభా ప్రాతిపదికన..

- కేంద్రబడ్జెట్‌లో నిధులు కేటాయించాలి
- కేవీపీఎస్ ఆధ్వర్యంలో బడ్జెట్ ప్రతుల కాల్చివేత

కొండాపూర్(సంగారెడ్డి): దళిత జనాభా ప్రాతిపదికన కేంద్ర బడ్జెట్‌లో నిధులు కేటాయించాలని, గ్రామీణ ఉపాధి హామీ పథకానికి బడ్జెట్‌లో నిధులు తగ్గించడం అంటే గ్రామీణ పేద ప్రజలను విస్మరించడమేని కేవీపీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మాణిక్యం అన్నారు. పార్లమెంట్‌లో కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మల సీతారామన్ ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో దళితులు, గ్రామీణ ఉపాధి హామీ పథకానికి నిధుల తగ్గించడాన్ని నిరసిస్తూ కులవ్యక్ష వ్యతిరేక పోరాట సంఘం (కేవీపీఎస్) ఆధ్వర్యంలో గురువారం సంగారెడ్డి కొత్త బస్టాండ్ వద్ద ఆందోళన చేపట్టారు. కేంద్ర బడ్జెట్ పత్రాలను తగులబెట్టారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మోడీ ప్రభుత్వం మరోసారి దళితులను మోసం చేసిందన్నారు. అందుకు నిదర్శనం బడ్జెట్లో న్యాయ సాధికారతకు కేటాయింపులు తగ్గించడమేనని ఆరోపించారు. గత సంవత్సరం రూ 1819.52 కోట్లు కేటాయిస్తే ఈసారి రూ 976.85 కోట్లకు తగ్గించారన్నారు. దేశంలో దళితుల జనాభా 20 శాతం ఉంటే 16 శాతానికి కూడా నిధులు కేటాయించడం లేదని, దళితుల జనాభా ప్రాతిపదికన బడ్జెట్‌లో నిధులు కేటాయింపునకు సవరణలు చేయాలని డిమాండ్ చేశారు. దేశవ్యాప్తంగా దళితులపైన దాడులు, హత్యలు, అత్యాచారాలు జరిగినా కేంద్ర ప్రభుత్వం పట్టించుకునే పరిస్థితిలో లేదన్నారు. ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ, సబ్ ప్లాన్ చట్టాలను కేంద్ర ప్రభుత్వం నిర్వీర్యం చేసిందన్నారు. రాజ్యాంగం కల్పించిన రిజర్వేషన్లు, హక్కులపైన దాడి చేస్తుందన్నారు. బడ్జెట్లో మోడీ ప్రభుత్వం ప్రతీ బడ్జెట్‌లో ఉపాధి హామీ పథకానికి కేటాయింపులు తగ్గిస్తూ వస్తుందన్నారు. గత బడ్జెట్లో రూ.89,400 వేల కోట్లు కేటాయిస్తే, ఈ బడ్జెట్‌లో రూ 60 వేల కోట్లు కేటాయించిందన్నారు. గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని పటిష్ట పరిచే విధంగా నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో పోరాటాలు చేస్తామని కేంద్ర ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కేవీపీఎస్ జిల్లా అధ్యక్షుడు పి.అశోక్, జిల్లా ఉపాధ్యక్షుడు శివకుమార్, జిల్లా సహాయ కార్యదర్శి ప్రవీణ్, జిల్లా కమిటీ సభ్యులు దాస్, దత్తు, డీబీఎఫ్ నాయకురాలు లక్ష్మీ, ఎస్ఎస్‌డి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఇంటి రిజిస్ట్రేషన్‌కు డబ్బులు డిమాండ్ చేశారంటూ..

వాట్సాప్ గ్రూపుల్లో చక్కర్లు

చేర్యాల(సిద్దిపేట): ఓ ఇంటిని ఇతరుల పేరిట రిజిస్ట్రేషన్ చేసే విషయంలో సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో డబ్బులు డిమాండ్ చేసినట్లు ఆరోపిస్తున్న పోస్టులు గురువారం వాట్సాప్ గ్రూపుల్లో చక్కర్లు కొట్టిన విషయం స్థానికంగా చర్చనీయాంశమైంది. వివరాలు ఇలా ఉన్నాయి. చేర్యాల సబ్ రిజిస్ట్రార్ కార్యాలయ పరిధిలోని కొండపాక మండలంలోని ఓ గ్రామానికి చెందిన మహిళ తన పాత ఇంటిని కుమారుడి పేరిట గిఫ్ట్ రిజిస్ట్రేషన్ చేసింది. ఆమె కుమారుడితో వచ్చిన వారు సబ్ రిజిస్ట్రార్‌తో మాట్లాడుతుండగా కొందరు ఫొటోలు తీశారు. వీడియో చిత్రీకరించారు. కార్యాలయంలో రూ.10 వేలు డిమాండ్ చేయగా, రూ.4 వేలు ఇచ్చి రిజిస్ట్రేషన్ పూర్తి చేసుకున్నారని పేర్కొంటూ వాట్సాప్ గ్రూపుల్లో పోస్టులు పెట్టారు. ఎస్ఆర్వోతో మాట్లాడేందుకు ప్రయత్నించగా ఫోన్ స్విచ్ ఆఫ్ వచ్చింది.

అగ్నివీర్‌గా ఎంపికైన యువకుడికి సన్మానం


భానుప్రసాద్‌ను సన్మానిస్తున్న ముదిరాజ్ సంఘం నాయకులు

గజ్వేల్‌రూరల్: దేశ రక్షణ కోసం కేంద్ర ప్రభుత్వం చేపట్టిన అగ్నివీర్‌కు ఎంపికైన యువకుడిని ముదిరాజ్ సంఘం నాయకులు సన్మానించారు. గురువారం గజ్వేల్ మండలం గిరిపల్లికి చెందిన పిట్ల భానుప్రసాద్ అగ్నివీర్‌గా నియమితుడవడంపై హర్షం వ్యక్తం చేశారు. శాలువా కప్పి సన్మానించారు. ఈ సందర్భంగా గజ్వేల్ మండల ముదిరాజ్ సంఘం అధ్యక్షుడు గుంటుకు శ్రీనివాస్, ప్రజ్ఞాపూర్ అధ్యక్షుడు రొట్టెల శ్రీనివాస్ మాట్లాడారు. దేశ రక్షణలో యువత భాగస్వాములు కావాలన్నారు. గిరిపల్లికి చెందిన యువకుడు భానుప్రసాద్ అగ్నివీర్‌గా నియమితువడవడం ఈ ప్రాంతానికే గర్వకారణమన్నారు. కార్యక్రమంలో ముదిరాజ్ సంఘం నాయకులు రమేశ్, రాజు, కృష్ణ, లింగం, భిక్షపతి, నర్సింలు తదితరులు పాల్గొన్నారు.


జానకంపల్లి వద్ద ఇసుక టిప్పర్లను అడ్డుకుంటూ రాస్తారోకో చేస్తున్న గ్రామస్తులు

ఇసుక రవాణాతో రోడ్డు పాడవుతుందని..

- టిప్పర్లను అడ్డుకున్న స్థానికులు
- గంటకుపైగా రాస్తారోకో
- పోలీసుల జోక్యంతో సద్దుమణిగిన వివాదం

మెదక్ రూరల్: అభివృద్ధి పనుల పేరిట హల్దీవాగు నుంచి ఇసుకను తరలించొద్దని డిమాండ్ చేస్తూ స్థానికులు టిప్పర్లను అడ్డుకుని రాస్తారోకో నిర్వహించారు. ఈ సంఘటన గురువారం మెదక్ మండల పరిధిలో చోటుచేసుకుంది. గంటకుపైగా ఆందోళన కొనసాగగా, పోలీసుల జోక్యంతో వివాదం సద్దుమణిగింది. స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మండల పరిధిలోని జానకంపల్లి, సంగాయిగుడి తండా శివారులోని హల్దీవాగు నుంచి అభివృద్ధి పనుల కోసం అధికారులు అనుమతులు ఇచ్చారంటూ టిప్పర్లతో ఇసుకను తరలిస్తున్నట్లు తెలిపారు. నిత్యం ఇసుక వాహనాల రాకపోకలు కొనసాగుతుండటం వలన రోడ్డు పాడవుతుందని, గ్రామంలోకి దుమ్ముధూళీ పెరగడంతో అనారోగ్యానికి గురవుతున్నామని వాపోయారు. తమ ఇంటి అవసరాలకు ఒక్క ట్రాక్టర్ ఇసుకను ఇవ్వని అధికారులు, అభివృద్ధి పనుల పేరిట టిప్పర్లలో వందల ట్రిప్పుల ఇసుకను తరలించడం ఏమిటని ప్రశ్నించారు. స్థానికుల ఆందోళనతో రోడ్డుకు ఇరువైపులా వాహనాలు నిలిచిపోయాయి. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనాస్థలానికి చేరుకుని గ్రామస్తులతో చర్చించారు. అభివృద్ధి పనుల కోసం అధికారుల నుంచి అనుమతులు పొందిన తరువాతనే ఇసుక తరలింపు జరుగుతుందని పోలీసులు నచ్చజెప్పారు. ఆందోళన విరమించకుంటే చర్యలు తీసుకునే అవకాశం ఉంటుందని హెచ్చరించడంతో వివాదం సద్దుమణిగింది.

పాత కక్షలతో హత్య

- ఐదు రోజుల్లో నిందితుడి పట్టివేత
- వివరాలు వెల్లడించిన సీఐ సంతోశ్ కుమార్


వివరాలు వెల్లడిస్తున్న సీఐ సంతోశ్ కుమార్

మునిపల్లి(అందోల్): పాత కక్షలను మనసులో పెట్టుకుని ఓ వ్యక్తిని హత్య చేసిన నిందితుడిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సీఐ సంతోశ్ కుమార్ వివరాలు వెల్లడించారు. మృతుడి తండ్రి కొలుకుంద కిష్టయ్య ఫిర్యాదుతో దర్యాప్తు చేఏపట్టి నిందితుడిని పట్టుకున్నట్లు తెలిపారు. జనవరి 27వ తేదీ రాత్రి 10 గంట సమయంలో కోలుకొంద కొమురయ్య (35) తన ఇంటి వద్ద నిలుచున్నాడు. మద్యం తాగుదామని అదే గ్రామానికి చెందిన కోలుకొంద ఆంజనేయులు తన బైక్‌పై బుదేరా గ్రామ శివారుకు తీసుకెళ్లాడు. మద్యం తాగిన తర్వాత తన వెంట తెచ్చుకున్న కత్తితో కొమురయ్య కడుపులో పొడిచి, బండరాయితో తలపై మోదాడు. చనిపోయాడని నిర్ధారించుకుని మృతుడి సెల్‌ఫోన్ తీసుకున్నాడు. అనంతరం బైక్‌లో ఉన్న పెట్రోల్ తీసి కొమురయ్యపై పోసి నిప్పంటించాడు. తాను నేరం చేసినట్లు ఆంజనేయులు పోలీసుల ముందు ఒప్పుకున్నాడు. నిందితుడి నుంచి మృతుడు కొమురయ్య సెల్‌ఫోన్‌ను పోలీస్‌లు స్వాధీనం చేసుకున్నారు. ఎలాంటి అధారం లేని కేసును సవాల్‌గా తీసుకుని ఐదు రోజుల్లో నిందితుడిని పట్టుకున్న సీఐ సంతోశ్ కుమార్, ఎస్ఐ సీహెచ్ రాజశేఖర్, పోలీస్ సిబ్బంది రామకృష్ణ, ఎండి హనీఫ్, గణపతి, పాండు, జగదీష్‌ను సంగారెడ్డి డీఎస్పీ రవీంద్రారెడ్డి అభినందించారు.

కారు ఢీకొని వృద్ధురాలి మృతి

కంది(సంగారెడ్డి): కారు ఢీకొని వృద్ధురాలు మృతి చెందింది. ఈ సంఘటన కంది మండల పరిధి కవలంపేటలో చోటుచేసుకుంది. రూరల్ ఎస్ఐ ఖుర్షీద్ అలీ కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. కవలంపేటకు చెందిన మంగళి పెంటమ్మ (68) గురువారం ఉదయం తన మనుమడిని పాఠశాలకు పంపేందుకు రోడ్డుప్రక్కన నిలిచి ఉండగా సంగారెడ్డి నుంచి పటాన్‌చెరు వెళుతున్న కారు ఢీ కొట్టడంతో మృతి చెందింది.

దొంగ అరెస్ట్.. రిమాండ్‌కు తరలింపు

నర్సాపూర్: జల్సాలకు అలవాటు పడి సులభంగా డబ్బులు సంపాదించాలనే ఉద్దేశంతో చోరీలకు పాల్పడిన వ్యక్తిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు పంపినట్లు సీఐ షేక్‌లాల్‌మదార్ తెలిపారు. గురువారం ఆయన తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. సంగారెడ్డి జిల్లా హత్నూర మండలం మంగాపూర్ గ్రామానికి చెందిన ఎండీ హుస్సేన్ జల్సాలకు అలవాటు పడ్డాడు. సులభంగా డబ్బు సంపాదించాలనే ఆలోచనతో చోరీలు చేసేవాడు. ఇటీవల నర్సాపూర్‌లో పలు దొంగతనాలు చేశాడు. పోలీసులు అతడి నుంచి 80 తులాల వెండి నగలు, బైక్‌ను స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిని కోర్టులో హాజరు పరచగా జడ్జి రిమాండ్ విధించినట్లు సీఐ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి ..

పెద్దశంకరంపేట(మెదక్): రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ సంఘటన గురువారం రాత్రి చోటుచేసుకుంది. మండలంలోని జూకల్ గ్రామానికి చెందిన చాకలి అనిల్‌కుమార్, శేఖర్ పల్సర్‌పై పెట్రోల్ కోసం రాంగ్ రూట్‌లో వెళ్తున్నారు. ఈ క్రమంలో జాతీయ రహదారి నుంచి పెద్దశంకరంపేట వస్తున్న కారు ఢీకొట్టడంతో ఇద్దరూ తీవ్రంగా గాయపడ్డారు. క్షతగాత్రులను జోగిపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

తాటి చెట్టుపై నుంచి పడి..

గీత కార్మికుడికి తీవ్రగాయాలు


తీవ్రంగా గాయపడిన స్వామిగౌడ్

కొమురవెల్లి(సిద్దిపేట): కల్లు తీసేందుకు తాటిచెట్టు ఎక్కి ప్రమాదవశాత్తు పట్టుతప్పడంతో పైనుంచి జారిపడిన గీత కార్మికుడికి తీవ్రగాయాలయ్యాయి. ఈ ఘటన మండలంలోని గురువన్నపేటలో గురువారం చోటుచేసుకుంది. స్థానికులు, కుటుంబసభ్యులు తెలిపిన వివరాల ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన బుడిగే స్వామిగౌడ్(60) ఎప్పటిలాగే చెట్టు ఎక్కి కల్లు గీస్తున్నాడు. ప్రమాదవశాత్తు పట్టుతప్పి కాలు జారడంతో కింద పడి తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు గమనించి 108 అంబులెన్స్‌కు సమాచారం అందించడంతో వారు సంఘటన స్థలానికి చేరుకొని ప్రథమ చికిత్స చేసిన అనంతరం గజ్వేల్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. గజ్వేల్ ప్రభుత్వ వైద్యుల సూచనమేరకు మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్ తరలించినట్లు తెలిపారు. స్వామిగౌడ్‌కు రెండు కాళ్లు విరిగినట్లు సమాచారం.

కుటుంబ కలహాలతో వ్యక్తి ఆత్మహత్య


ఆస్పత్రి వద్ద రోదిస్తున్న మృతుడి బంధువులు

దుబ్బాక రూరల్: కుటుంబ కలహాలతో ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ సంఘటన గురువారం జరిగింది. సీఐ కృష్ణ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని శిలాజీనగర్ గ్రామంలోని టేకుల తండాకు చెందిన బానోత్ గోపాల్(38) ఏడాదిన్నర క్రితం ఉపాధి కోసం విదేశాలకు వెళ్లాడు. నెల క్రితం స్వగ్రామానికి వచ్చాడు. తన భార్య రజితకు అక్రమ సంబంధం ఉందని తండాలో పుకార్లు రావడంతో భార్యాభర్తలు గొడవపడేవారు. ఫిబ్రవరి 1వ తేదీన భార్య ఇంటి నుంచి వెళ్లి తిరిగిరాలేదు. ఆమె కోసం వెతికినా ఆచూకీ లభించకపోవడంతో గురువారం ఉదయం తన పొలంలోని చెట్టుకు గోపాల్ ఉరివేసుకున్నాడు. స్థానికులు గమనించి కుటుంబ సభ్యులు, పోలీస్‌లకు సమాచాం ఇచ్చారు. మృతుడి భార్య రజిత భర్త చనిపోయిన విషయం తెలుసుకుని ఇంటికి చేరుకుంది. గోపాల్ మృతికి భార్యే కారణమంటూ బంధువులు, తండా వాసులు కొద్ది సేపు ఆందోళన చేశారు. సంఘటనా స్థలానికి పోలీస్‌లు చేరుకుని వారికి నచ్చజెప్పారు. మృతుడికి ఇద్దరు కూతుళ్లు ఉన్నారు. తన బావ గోపాల్ అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడని పలువురిపై అనుమానం వ్యక్తం చేస్తూ బావ మరిది శ్రీనివాస్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టినట్లు సీఐ తెలిపారు. పోస్ట్ మార్టం నిమిత్తం మృతదేహాన్ని దుబ్బాక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.


చేపల వలలో చిక్కి మత్స్యకారుడి మృతి


యాదగిరి (ఫైల్)


యాదగిరి మృతదేహాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

మనోహరాబాద్(తూప్రాన్): చేపల వేటకు వెళ్లిన మత్స్యకారుడు, చేపల వలలో చిక్కడంతో నీటమునిగి మృతి చెందాడు. ఈ సంఘటన మనోహరాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో గురువారం చోటు చేసుకుంది. మనోహరాబాద్ ఎస్ఐ సందీప్ రెడ్డి తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని పోతారం గ్రామానికి చెందిన దుంపల(బెస్త) యాదగిరి (50) బుధవారం గ్రామ ఊర చెరువులో చేపలు పట్టడానికి వెళ్లాడు. సాయంత్రమైన ఇంటికి రాకపోవడంతో చెరువు వద్ద వెళ్లి వెతికగా గట్టుపైన అతడి దుస్తులు గమనించారు. గురువారం చెరువులో వెతకగా చేపల వలలో చిక్కుకుని నీటమునిగి మృతి చెందినట్లు గ్రహించారు. భార్య నాగమణి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం తూప్రాన్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. మృతునికి ఇద్దరు కుమార్తెలున్నారు.

చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి


కృష్ణ (ఫైల్)

హత్నూర(సంగారెడ్డి): భూ వివాదంలో ముగ్గురు అన్నదమ్ములు గొడవపడ్డారు. దీంతో చివరివాడు ఆత్మహత్యకు యత్నించాడు. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడు. ఎస్ఐ లక్ష్మారెడ్డి తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మండల పరిధిలోని నాగారం గ్రామానికి చెందిన దుర్గోల్ల పోచయ్య, బలరాం, కృష్ణ అన్నదమ్ములు. వీరిలో చివరివాడు కృష్ణ (40). ఇటీవల ఉమ్మడి ఆస్తి విషయంలో జనవరి 30వ తేదీన ముగ్గురు అన్నదమ్ములు హత్నూర పోలీస్‌స్టేషన్ వచ్చారు. వారి డాక్యుమెంట్లను పరిశీలించిన ఎస్ఐ లక్ష్మారెడ్డి సివిల్ మేటర్ కావడంతో బయట కూర్చొని మాట్లాడుకోవాలని నచ్చజెప్పి పంపారు. స్టేషన్ నుంచి బయటకు వచ్చిన కృష్ణ ఒంటిపై పెట్రోల్ పోసుకొని ఆత్మహత్య యత్నించిన విషయం తెలిసిందే. తీవ్రంగా గాయపడటంతో చికిత్సం నిమిత్తం సంగారెడ్డి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అప్పటికే అతడి పరిస్థితి విషమించడంతో వైద్యుల సూచన మేరకు హైదరాబాద్ గాంధీ ఆస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ కృష్ణ గురువారం మృతి చెందాడు. మృతుడి సోదరుడు పోచయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నారు. పోస్టుమార్టం నిర్వహించి మృతదేహాన్ని కుటుంబీకులకు అప్పగించినట్లు ఎస్ఐ తెలిపారు.

భూముల పొతీల విషయంలో అనుమానాలు

- తహసీల్దార్ ఏకపక్ష నిర్ణయాలని ఆరోపణలు
- బాధితుల రాస్తారోకో
- భూమి దక్కదని బాధితుల్లో ఒకరు ఆత్మహత్యాయత్నం


ధర్నా చేస్తున్న బాధితులు, బీఆర్ఎస్ నాయకులు

కొండపాక(గజ్వేల్): భూముల పొతీల విషయంలో సిద్దిపేట జిల్లా కుకునూరుపల్లి మండల తహసీల్దార్ ఆశాజ్యోతి ఏకపక్ష నిర్ణయాలను నిరసిస్తూ బాధితులు ఆందోళనకు దిగారు. ఆందోళనలో ఈగ తిరుపతి ఒంటిపై కిరోసిన్ పోసుకొని ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. కుకునూరుపల్లి సర్పంచ్ పాల్కంపల్లి జయంతి భర్త, బీఆర్ఎస్ నాయకుడు నరేందర్ మద్దతు పలకడంతో ఆందోళనకు మరింత బలం చేకూరింది. బాధితులకు మద్దతుగా పీఏసీఎస్ వైస్ చైర్మన్ పిస్క అమరేందర్, మాజీ సర్పంచ్ కాచం నవీన్‌కుమార్, మండల కోఆప్షన్ సభ్యుడు అజీమొద్దీన్ తదితరులు మద్దతు తెలుపుతూ రాస్తారోకో చేశారు. ఈగ శంకరయ్య కుటుంబీకుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. కుకునూరుపల్లి గ్రామ శివారులోని రాజీవ్ రహదారికి ఆనుకొని ఉన్న 532, 533 సర్వేనంబర్‌లోని 2 ఎకరాల 11 గుంటల పట్టా భూమి నుంచి కొమ్మసారం కొండయ్య, కెమ్మసారం చిత్తయ్య వద్ద కొన్నేళ్ల కిందట 63 గుంటల భూమిని పాల్కంపల్లి యాదగిరి, 7 గుంటల భూమిని ఈగ శంకరయ్య కొనుగోలు చేసి రిజిస్ట్రేషన్ చేయించుకున్నారు. ఈ సర్వేనంబర్లలోంచి కొంత భూమి రాజీవ్ రహదారి విస్తరణలో పోయిందన్నారు. ఐనప్పటికీనీ పట్టా వారి పేరిటే వస్తుందన్నారు. ఈ నేపథ్యంలో ఈగ శంకరయ్య కొనుగోలు చేసిన 7 గుంటల భూమిని తహసీల్దార్ ఆశాజ్యోతి కెమ్మసారం కొండయ్య భార్య కమల పేరిట పొతీ చేయడంతో ఆందోళనకు దారి తీసింది. ఈ విషయంపై తహసీల్దార్‌ను సంప్రదించగా ఆమె పొంతనలేని సమాధానం చెబుతుంటంతో బాధితులు పోలీసులను ఆశ్రయించారు. సమస్య పరిష్కారమయ్యే వరకు భూమిలోకి ఎవరూ వెళ్లొదంటూ ఎస్ఐ వారికి నచ్చజెప్పి పంపించారు. గురువారం భూమి చుట్టూ కడ్డీలు పాతడం ప్రారంభించారు. ఈ విషయాన్ని తహసీల్దార్ దృష్టికి తీసుకెళ్లినా, తామేమి చేయలేమంటూ దాటవేసే ధోరణతో మాట్లాడటంతో బాధితులు రోడ్డుపై బైఠాయించారు. నరేందర్ వారికి మద్దతు తెలిపి రాస్తారోకోలో పాల్గొన్నారు. ఆందోళన చేస్తున్న తహసీల్దార్ పట్టించుకోకపోవడంతో ఈగ తిరుపతి ఆత్మహత్యకు యత్నించాడు. తహసీల్దార్ పనితీరులపై కలెక్టర్, మంత్రి హరీశ్ రావుకు నరేందర్ ఫిర్యాదు చేస్తామన్నారు. ఈవిషయంపై తహసీల్దార్‌ను వివరణ కోరగా కాగితాల ఆధారంగా భూమిని పొతీ చేశామన్నారు.

క్లుప్తంగా

స్మశానవాటిక నిర్మించండి



మున్సిపల్ కమిషనర్‌కు వినతిపత్రం ఇస్తున్న గ్రామస్తులు

హుస్నాబాద్: పట్టణంలోని ఆరెపల్లెలో స్మశాన వాటిక నిర్మించాలని గ్రామస్తులు గురువారం మున్సిపల్ కమిషనర్ రాజమల్లయ్యకు వినతి పత్రం ఇచ్చారు. పట్టణంలోని 8, 9వ వార్డులో స్మశానవాటిక లేక ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారని తెలిపారు. ఎవరైనా చనిపోతే పల్లె చెరువు మత్తడిలోనే అంత్యక్రియలు చేస్తున్నారన్నారు. ప్రజలకు అనుగుణంగా అందరికీ ఉపయోగపడేలా పల్లె చెరువు దగ్గరలో స్మశానవాటికను నిర్మించాలని మున్సిపల్ కమిషనర్‌కు విజ్ఞప్తి చేసినట్లు వార్డు ప్రజలు తెలిపారు. కార్యక్రమంలో 8వ వార్డు కౌన్సిలర్ మ్యాదరబోయిన వేణుయాదవ్, అన్ని కులాల సంఘాల అధ్యక్షులు పాల్గొన్నారు.

భగీరథ లీకేజీలను అరికట్టాలి



ప్రధాన రహదారి వెంబడి భగీరథ లీకేజీతో నిలిచిన నీరు

అక్కన్నపేట(హుస్నాబాద్): మండలంలోని పలు గ్రామాల్లో మిషన్ భగీరథ పనులు అస్తవ్యస్తంగా మారడంతో లీకేజీలకు కేరాఫ్‌గా మారాయి. అక్కన్నపేట, నందారం, గౌరవెల్లి గ్రామాలతో పాటు పలు గ్రామాల్లో మిషన్ భగీరథ లీకేజీల కారణంతో రోడ్లు బురదమయంగా మారుతున్నాయి. దీంతో స్వచ్ఛమైన భగీరథ నీరు కలుషితంగా మారుతున్నాయని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. లీకేజీలు కావడంతో భగీరథ నీరు వృథాగా పోతుందని గ్రామస్తులు వాపోతున్నారు. కాంట్రాక్టర్ కేవలం వంతుకు గంతేసినట్లు పనులు చేపట్టారని ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి సంబంధిత అధికారులు లీకేజీలను అరికట్టాలని ఆయా గ్రామాల గ్రామస్తులు కోరుతున్నారు.

మొగి పురుగు నివారణకు చర్యలు తీసుకోవాలి



వరి పంటను పరిశీలిస్తున్న అధికారి

మర్కూక్(గజ్వేల్): మండలంలోని పలు గ్రామాల్లో వరి పొలాలను మండల వ్యవసాయ అధికారి నాగేందర్‌రెడ్డి గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వరిలో మొగి పురుగు ఎక్కువగా ఆశిస్తుందని చెప్పారు. మొగి పురుగు నివారణ చర్యలు తీసుకోవాలని రైతులకు సూచించారు. వ్యవసాయ అధికారుల సలహాలు, సూచనలు మేరకు మందులను పిచికారీ చేయాలని కోరారు. కార్యక్రమంలో రైతులు పాల్గొన్నారు.

పాఠశాలకు టీవీ వితరణ



పాఠశాలకు టీవీ అందిస్తున్న నాయకులు

మర్కూక్(గజ్వేల్): మండలంలోని చేబర్తి గ్రామంలో ప్రాథమిక పాఠశాలకు గురువారం గ్రామానికి చెందిన రామారావు, లక్ష్మణ్‌రావు తల్లిదండ్రులు వెంకటేశ్వర్‌రావు, సుగుణ బాయి జ్ఞాపకార్థంగా టీవీని అందించారు. ఎంపీపీ పాండుగౌడ్ మాట్లాడుతూ.. మారుతున్న విద్యాబోధనలో భాగంగా విద్యార్థులకు డిజిటల్ విద్య ఎంతో అవసరమని తెలిపారు. కార్యక్రమంలో ఎంఈఓ ఉదయ్‌భాస్కర్‌రెడ్డి, సర్పంచ్ అశోక్, ఎస్ఎంసీ చైర్మన్ రాములు, హెచ్ఎం నర్సింలు, యువకులు యాదగిరి, చిన్నికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

మద్దతు ధరతో రైతుకు మేలు



గోవా మార్కెట్ ఎదుట మార్కెట్ కమిటీ సభ్యులు

చేర్యాల(సిద్దిపేట): ప్రభుత్వం అందిస్తున్న మద్దతు ధరతోనే రైతులకు మేలు జరుగుతుందని చేర్యాల వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ సుంకరి మల్లేశంగౌడ్, వైస్ చైర్మన్ పుర్మ వెంకట్‌రెడ్డి అన్నారు. మార్కెట్‌కు నిధులు సమీకరించి అభివృద్ధి చేయడంతో పాటు రైతులకు సౌకర్యాలు కల్పించే కార్యక్రమంపై అవగాహన కోసం మార్కెట్ కమిటీ సభ్యులు, సిబ్బంది దేశంలోని పలు రాష్ట్రాల మార్కెట్లను సందర్శించేందుకు వెళ్లారు. అందులో భాగంగా గోవా మార్కెట్‌ను గురువారం సందర్శించి అక్కడ రైతులకు అందుతున్న ధర, కల్పిస్తున్న సౌకర్యాలు తదితర అంశాలను తెలుసుకున్నారు. యాత్రకు వెళ్లిన వారిలో కమిటీ సభ్యులు వల్లూరి శ్రీనివాస్, గోపాల్‌రెడ్డి, సత్యనారాయణ, రాజేశం, సిబ్బంది ఉన్నారు.

'కంటి వెలుగు'ను పకడ్బందీగా నిర్వహించాలి

సిద్దిపేట మున్సిపల్ కమిషనర్ రవీందర్‌రెడ్డి



దుబ్బాక 20వ వార్డులో శిబిరాన్ని ప్రారంభిస్తున్న చైర్‌పర్సన్ వనిత



సిద్దిపేటజోన్: శిబిరాన్ని పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనర్ రవీందర్‌రెడ్డి, వైస్ చైర్మన్ కనకరాజు

సిద్దిపేటజోన్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కంటి వెలుగును పకడ్బందీగా నిర్వహించి సిద్దిపేట రాష్ట్రానికి ఆదర్శంగా ఉండేలా చూద్దామని మున్సిపల్ కమిషనర్ రవీందర్‌రెడ్డి సూచించారు. గురువారం ఆయన మున్సిపల్ వైస్ చైర్మన్ కనకరాజుతో కలిసి పట్టణంలోని 8, 9, 22, 23, 32, 43 వార్డుల్లో ఏర్పాటు చేసిన కంటి వెలుగు శిబిరాలను పరిశీలించారు. శిబిరానికి వచ్చే ప్రతి ఒక్కరినీ స్క్రీనింగ్ చేసి అవసరమైన వారికి అద్దాలు ఇవ్వాలని, అదే విధంగా ఆపరేషన్ ఆవశ్యకత ఉన్న వారిని రెఫర్ చేయాలని సూచించారు. వైద్య, మున్సిపల్ శాఖల సిబ్బంది, అధికారులు సమష్టిగా నిర్వహణలో భాగస్వామ్యం కావాలని సూచించారు. అత్యధికంగా స్క్రీనింగ్ చేసిన మున్సిపాలిటీగా ఆదర్శంగా ఉండాలని సూచించారు. ఆయన వెంట ఆయా వార్డుల కౌన్సిలర్లు కవిత సురేష్, సతీశ్, అరవింద్, లక్ష్మణ్, శోభారాణి, పూర్ణిమఎల్లం, మున్సిపల్ అధికారులు శ్రీనివాస్‌రెడ్డి, మహేశ్, అన్వేశ్ పాల్గొన్నారు.

హుస్నాబాద్: పట్టణంలోని గోదామ్ గడ్డలో ఏర్పాటు చేసిన కంటి వెలుగు శిబిరంలో గురువారం హుస్నాబాద్ సర్కిల్ పోలీస్‌లు కంటి పరీక్షలు చేయించుకున్నారు. ఈ సందర్భంగా ఏసీపీ సతీశ్ మాట్లాడుతూ.. కంటి వెలుగు కార్యక్రమాన్ని సర్కిల్ పోలీస్ అధికారులు, సిబ్బంది సద్వినియోగం చేసుకోవాలన్నారు. 54 మంది పోలీస్‌లు కంటి పరీక్షలు చేయించుకున్నారు. కార్యక్రమంలో సీఐ ఎర్రల కిరణ్, ఎస్సైలు శ్రీధర్, వివేక్, నరేందర్‌రెడ్డి, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

తొగుట(దుబ్బాక): కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ లతానరేందర్‌రెడ్డి కోరారు. మండలంలోని లింగంపేట గ్రామంలో కంటి వెలుగు శిబిరాన్ని గురువారం ప్రారంభించారు. కార్యక్రమంలో సర్పంచ్ రేణుకానర్సింలు, ఎంపీపీ ఉపాధ్యక్షుడు శ్రీకాంత్‌రెడ్డి, ఏఎంసీ చైర్మన్ కొమురయ్య, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు రాంరెడ్డి, ఎంపీడీవో శ్రీధర్, వైద్యుడు రాధాకిషన్ పాల్గొన్నారు.

దుబ్బాకటౌన్: ఆరోగ్య తెలంగాణే లక్ష్యంగా సీఎం కేసీఆర్ కంటి వెలుగు కార్యక్రమానికి శ్రీకారం చుట్టారని దుబ్బాక మున్సిపల్ చైర్‌పర్సన్ గన్నె వనితాభూంరెడ్డి అన్నారు. గురువారం పట్టణంలోని 20వ వార్డులో కంటి వెలుగు కార్యక్రమాన్ని బస్టాండ్ వద్ద గెస్ట్‌హౌజ్‌లో ప్రారంభించారు. కార్యక్రమంలో కౌన్సిలర్ రాజమణిలచ్చయ్య, కమిషనర్ గణేశ్‌రెడ్డి, సిబ్బంది ఉన్నారు.

'కంటి వెలుగు' దేశానికే ఆదర్శం



అవుసులోనిపల్లి శిబిరంలో కంటి అద్దాలు అందజేస్తున్న ప్రతాప్‌రెడ్డి

వర్గల్(గజ్వేల్): సీఎం కేసీఆర్ ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న కంటివెలుగు కార్యక్రమం దేశానికే ఆదర్శమని రాష్ట్ర అటవీ అభివృద్ధి సంస్థ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి అన్నారు. గురువారం వర్గల్ మండలం అవుసులోనిపల్లిలో కంటివెలుగు శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అంధత్వం నివారించేందుకు కంటి వెలుగు ఊరూరా ఒక యజ్ఞంలా కొనసాగుతుందన్నారు. ఈ శిబిరాలను గ్రామస్తులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ లతారమేశ్‌గౌడ్, జెడ్పీటీసీ బాలుయాదవ్, పీఏసీఎస్ చైర్మన్ రామకృష్ణారెడ్డి, వైస్ ఎంపీపీ బాల్‌రెడ్డి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు వేలూరి వెంకట్‌రెడ్డి, సర్పంచ్ కరుణాకర్, ఎంపీడీఓ స్వర్ణకుమారి, సీనియర్ నాయకుడు పూదరి యాదగిరిగౌడ్, సర్పంచ్ కరుణాకర్, వైద్యులు, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ పరీక్షలు చేయించుకోవాలి

గజ్వేల్‌రూరల్: పట్టణంలోని ఐవోసీ(ఇంటిగ్రేటెడ్ ఆఫీస్ కాంప్లెక్స్)లో గురువారం డివిజన్ పరిధిలోని పోలీసు అధికారులు, సిబ్బందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో గజ్వేల్–ప్రజ్ఞాపూర్ మున్సిపల్ చైర్మన్ ఎన్‌సీ రాజమౌళితో కలిసి గజ్వేల్ ఏసీపీ రమేశ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో 150మంది పోలీసులు కంటి పరీక్షలు చేయించుకున్నారు. కార్యక్రమంలో గజ్వేల్ సీఐ వీరప్రసాద్, తొగుట సీఐ కమలాకర్, దౌల్తాబాద్ ఎస్ఐ చైతన్యరెడ్డి, రాయపోల్ ఎస్ఐ మహబూబ్, పోలీసు అధికారులు, సిబ్బంది, కౌన్సిలర్ మెట్టయ్య, నాయకులు పాల్గొన్నారు.

పద్మశాలి సమాజ అభివృద్ధికి లక్ష విరాళం



శ్రీధర్‌రావుకు జ్ఞాపికను అందిస్తున్న సంఘం సభ్యులు

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): జిల్లా కేంద్రంలోని మార్కండేయ ఆలయ పద్మశాలి సమాజం 60వ వార్షికోత్సవానికి గురువారం కల్వకుంట్ల రంగారావు ఫౌండేషన్ చైర్మన్ వంశీధర్‌రావు హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. సమాజ అభివృద్ధి కోసం రూ.లక్ష విరాళాన్ని అందించారు. ఈ సందర్భంగా పద్మశాలి సమాజ అధ్యక్షుడు కాముని రాజేశం, సభ్యులు ఎల్లం సాయి అసోసియేషన్ అధ్యక్షులు రమేశ్, శ్రీకాంత్ తదితరులు వంశీధర్‌రావును శాలువాతో సన్మానించి జ్ఞాపికను అందించారు. కార్యక్రమంలో సాయి యూత్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు గౌరీశంకర్‌గౌడ్, సభ్యులు సురేందర్‌గౌడ్, సతీశ్, సరేశ్‌లాల్ తదితరులు పాల్గొన్నారు.

పెద్దమ్మ ఆలయ నిర్మాణానికి భూమిపూజ

జగదేవ్‌పూర్(గజ్వేల్): మండలంలోని ఇటిక్యాల గ్రామంలో ముదిరాజ్ కులదైవమైన పెద్దమ్మ ఆలయ నిర్మాణానికి సర్పంచ్ చంద్రశేఖర్, మండల ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో గురువారం భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రతీ గ్రామంలో ముదిరాజ్‌ల కుల దేవత పెద్దమ్మ ఆలయాల నిర్మాణానికి కృషి చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో సంఘం నాయకులు కొంపల్లి శ్రీనివాస్, బాలకిసాన్, పరమేశ్వర్, బాబు, నరేశ్, నర్సింలు, కరుణాకర్ తదితరులు పాల్గొన్నారు.

సీసీరోడ్డు పనులు ప్రారంభం

బెజ్జంకి(సిద్దిపేట): గ్రామాల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తుందని బెజ్జంకి జెడ్పీటీసీ సభ్యురాలు కనగండ్ల కవిత పేర్కొన్నారు. మండలంలోని గూడెంలో గురువారం సీసీరోడ్డు పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి హరీశ్‌రావు, ఎమ్మెల్యే బాలకిషన్‌లకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ రాజయ్య, సర్పంచ్ రాజశ్రీ, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు మహిపాల్‌రెడ్డి, లక్ష్మణ్, ప్యాక్స్ డైరెక్టర్ లక్ష్మణ్, కార్యదర్శి లావణ్య తదితరులు పాల్గొన్నారు.

పేదల సంక్షేమమే బీఆర్ఎస్ లక్ష్యం

ఎఫ్‌డీసీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి



చెక్కు అందజేస్తున్న ఎఫ్‌డీసీ చైర్మన్ ప్రతాప్‌రెడ్డి, తదితరులు

గజ్వేల్: పేదల సంక్షేమమే బీఆర్ఎస్ లక్ష్యమని అటవీ అభివృద్ధి సంస్థ(టీఎస్ఎఫ్‌డీసీ) చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి అన్నారు. గురువారం గజ్వేల్ మండలం రిమ్మనగూడ గ్రామంలో ఇటీవల రోడ్డు ప్రమాదానికి గురై మృతి చెందిన శ్రీరాముల కిషన్‌కు బీఆర్ఎస్ నుంచి వచ్చిన రూ.2లక్షల ప్రమాద బీమా చెక్కును మృతుడి భార్య లక్ష్మికి అందజేశారు. ఈ సందర్భంగా ప్రతాప్‌రెడ్డి మాట్లాడుతూ.. అభివృద్ధి, సంక్షేమాన్ని కొత్త పుంతలు తొక్కించిన బీఆర్ఎస్ ప్రభుత్వం కార్యకర్తల సంక్షేమంలోనూ తన కంటూ ప్రత్యేకతను చాటుకుంటుందన్నారు. బీఆర్ఎస్ పార్టీ అమలు చేస్తున్న పథకాలు దేశానికే ఆదర్శంగా నిలిచాయని అభిప్రాయపడ్డారు. కార్యక్రమంలో గజ్వేల్ మార్కెట్ కమిటీ చైర్మన్ మాదాసు శ్రీనివాస్, ఎంపీపీ అమరావతి, గజ్వేల్–ప్రజ్ఞాపూర్ మున్సిపల్ చైర్మన్ ఎన్‌సీ రాజమౌళి, ఆత్మ కమిటీ చైర్మన్ ఊడెం కృష్ణారెడ్డి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు బెండె మధు, పట్టణ అధ్యక్షుడు నవాజ్‌మీరా, మాజీ జెడ్పీటీసీ బొల్లారం ఎల్లయ్య, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

క్రీడలు మానసికోల్లాసానికి దోహదం



బహుమతులు అందజేస్తున్న సర్పంచ్ రాజేందర్

దుబ్బాక: క్రీడలు మానసిక ఉల్లాసంతో పాటు దేహ దారుఢ్యాన్ని పెంచేందుకు దోహదం చేస్తాయని సర్పంచ్ బచ్చు రాజేందర్ అన్నారు. రాయపోల్ మండలం వడ్డెపల్లి గ్రామంలో మండల స్థాయి వాలీబాల్ టోర్నమెంట్ నిర్వహించారు. క్రీడా పోటీల్లో గెలుపొందిన విజేతల జట్లకు గురువారం బహుమతుల ప్రదానంతో పాటు నగదును అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గెలుపోటములు సహజమన్నారు. కార్యక్రమంలో బేగంపేట పీఈటీ కనకయ్య, ఫీల్డ్ అసిస్టెంట్ స్వామి తదితరులు పాల్గొన్నారు.

సులభ్ కాంప్లెక్స్ ప్రారంభం



సులభ్ కాంప్లెక్స్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ముత్తిరెడ్డి

కొమురవెల్లి(సిద్దిపేట): కొమురవెల్లి మల్లికార్జున స్వామి ఆలయంలో రూ.42లక్షలతో నిర్మించిన సులభ్ కాంప్లెక్స్‌ను జనగామ ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి ఆలయ చైర్మన్ గీస భిక్షపతితో కలసి గురువారం ప్రారంభించారు. అనంతరం ఆలయ పరిసరాలను కలియతిరిగారు. ఈ సందర్భంగా ఆలయ అధికారులకు పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. ఆలయ పరిసరాల్లో చెత్త కనిపించకుండా చూడాలని, వసతి గదుల వెనుకాల సీసీరోడ్డును వేయాలని ఆలయ ఈవో బాలాజీకి సూచించారు. స్వామివారి గుట్టపై త్రిశూలం, ఢమరుకం ఏర్పాటుకు కావాల్సిన చర్యలు చేపట్టాలని ఆలయ ఏఈ శంకర్‌ను ఆదేశించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సిద్ధప్ప, చేర్యాల, మద్దూరు ఎంపీపీలు కరుణాకర్, కృష్ణారెడ్డి, ఆలయ ధర్మకర్తలు, ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

'మన ఊరు–మన బడి' పనులు ప్రారంభం

మద్దూరు(హుస్నాబాద్): మండలంలోని రేబర్తి గ్రామంలో గల ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 'మన ఊరు–మన బడి' కార్యక్రమంలో పాఠశాల భవన నిర్మాణానికి రూ.1.13కోట్ల నిధులు మంజూరు కావడంతో గురువారం సర్పంచ్ నాంపల్లి సరిత పనులను ప్రారంభించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి ఎంతో కృషి చేస్తుందన్నారు. ప్రభుత్వ బడుల్లో మెరుగైన వసతులు సమకూర్చేందుకు నూతన భవనాలను నిర్మిస్తుందన్నారు. కార్యక్రమంలో గ్రామ ఉపసర్పంచ్ డాకురి లక్ష్మీవెంకట్‌రెడ్డి, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధికి పెద్దపీట



సీసీరోడ్డు నిర్మాణ పనులను ప్రారంభిస్తున్న దృశ్యం

గజ్వేల్‌రూరల్: పోరాడి సాధించుకున్న రాష్ట్రంలో సీఎం కేసీఆర్ గ్రామాల అభివృద్ధికి పెద్దపీట వేస్తున్నారని గజ్వేల్ ఏఎంసీ చైర్మన్ మాదాసు శ్రీనివాస్ పేర్కొన్నారు. మండల పరిధిలోని అక్కారం గ్రామంలో సర్పంచ్ బాల్‌చంద్రం ఆధ్వర్యంలో చేపడుతున్న సీసీరోడ్డు నిర్మాణ పనులను ఎంపీపీ దాసరి అమరావతి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు బెండ మధు, సర్పంచ్‌ల ఫోరం మండల అధ్యక్షుడు చంద్రమోహన్‌రెడ్డిలతో కలిసి గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు తర్వాత గ్రామాల అభివృద్ధికి సీఎం కేసీఆర్ పెద్దపీట వేశారన్నారు. అభివృద్ధి, సంక్షేమమే ధ్యేయంగా ముందుకు సాగుతూ గ్రామాల్లో ప్రజలకు అవసరమయ్యే మౌలిక వసతులు, సౌకర్యాలను కల్పిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ బెల్దె కృష్ణాగౌడ్, గ్రామ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

'ఎంపీ ప్రతిపాదనల మేరకే నిధులు మంజూరు'

మిరుదొడ్డి(దుబ్బాక): మెదక్ ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డి ప్రతిపాదనల మేరకే ఎన్ఆర్ఈజీఎస్ పథకం ద్వారా నియోజకవర్గంలోని ప్రతీ గ్రామానికి రూ.10లక్షల చొప్పున నిధులు మంజూరయ్యాయని దుబ్బాక ఆత్మ కమిటీ చైర్మన్ నమిలె భాస్కరాచారి తెలిపారు. గురువారం మిరుదొడ్డిలో ఆయన మాట్లాడుతూ.. ఎన్ఆర్ఈజీఎస్ ద్వారా మంజూరైన నిధులను దుబ్బాక ఎమ్మెల్యే రఘునందన్‌రావు చొరవతోనే నిధులు మంజూరయ్యాయని బీజేపీ నాయకులు చేస్తున్న అసత్య ప్రచారాన్ని మానుకోవాలని హితువు పలికారు. ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డి ప్రతిపాదనల మేరకు రాష్ట్ర పంచాయతీ రాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు నియోజకవర్గ అభివృద్ధికి రూ.14.40 కోట్ల నిధులు మంజూరు చేయించారన్నారు. అందుకు సంబంధించిన ఆధారాలు తమ వద్ద ఉన్నాయని స్పష్టం చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ సాయిలు, మండల వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ సత్యనారాయణ, సర్పంచ్‌ల ఫోరం మండల అధ్యక్షుడు బాల్‌రాజు, కో–ఆప్షన్ మెంబర్ ఎండీ.అహ్మద్, ఏఎంసీ మాజీ చైర్మన్ బాపురెడ్డి, బీఆర్ఎస్ జిల్లా నాయకుడు లింగం, మండల అధ్యక్షుడు అంజిరెడ్డి పాల్గొన్నారు.

నిధుల మంజూరుపై హర్షం

మిరుదొడ్డి(దుబ్బాక): దుబ్బాక నియోజకవర్గ అభివృద్ధే లక్ష్యంగా ప్రతీ గ్రామానికి ఎన్ఆర్ఈజీఎస్ పథకంలో భాగంగా ఒక్కో గ్రామానికి రూ.10 లక్షల నిధులను కేంద్ర ప్రభుత్వం కేటాయించ హర్షణీయమని బీజేపీ మండల అధ్యక్షుడు ఎల్మల దేవరాజు అన్నారు. గురువారం మిరుదొడ్డిలో ఆయన మాట్లాడుతూ.. దుబ్బాక ఉప ఎన్నికల్లో ఎమ్మెల్యే రఘునందన్‌రావు నియోజకవర్గ ప్రజలకు ఇచ్చిన హామీ మేరకు పల్లెల అభివృద్ధికి పాటు పడుతున్నాడని కొనియాడారు. కార్యక్రమంలో నాయకులు రోశయ్య, మల్లేశం, అమర్, స్వామి, నారాయణరెడ్డి, సంజీవ్, గిరీష్, స్వామి పాల్గొన్నారు.

పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాలి



డైనింగ్ నిర్మాణ పనులను పరిశీలిస్తున్న జెడ్పీటీసీ జయమ్మ

ములుగు(గజ్వేల్): నిర్మాణ పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాలని ములుగు మండల జెడ్పీటీసీ నర్సంపల్లి జయమ్మఅర్జున్‌గౌడ్ కాంట్రాక్టర్లకు సూచించారు. మండలంలోని బస్వాపూర్‌లో రూ.70లక్షల గడా నిధులతో చేపట్టిన ఫంక్షన్ డైనింగ్ హాల్ నిర్మాణ పనులతో పాటు 'మన ఊరు–మన బడి' పథకం ద్వారా రూ.56లక్షల వ్యయంతో కొనసాగుతున్న పాఠశాల భవన నిర్మాణం పనులను గురువారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా జెడ్పీటీసీ మాట్లాడుతూ.. నాణ్యతతో కూడుకున్న నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేసి వినియోగంలోకి తేవాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కార్పొరేట్‌కు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పిస్తుందన్నారు. గ్రామాల అభివృద్ధిలో ప్రజలు భాగస్వాములు కావాలని, సమష్టి కృషి ఫలితంగానే గ్రామాలు అభివృద్ధి చెందుతాయని ఆమె కోరారు.

ఉచిత హోమియో వైద్య శిబిరం



పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): శిరిడీ సాయిబాబా సేవా సంస్థ ట్రస్ట్, అద్వైత ఆయుర్వేద హోమియోపతి సిద్దిపేట శాఖల ఆధ్వర్యంలో పట్టణంలోని శిరిడీ సాయిబాబా ఆలయంలో ఉచిత హోమియో వైద్య శిబిరం నిర్వహించారు. గురువారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు ఉచిత హోమియో శిబిరం నిర్వహించారు. డాక్టర్ జి. కృష్ణమూర్తి, డాక్టర్ గాయత్రి, డాక్టర్ దేవేందర్, మేనేజర్ శ్రీనివాస్ ప్రజలకు వైద్య సేవలు అందించారు. ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించి, ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో గందె శ్రీనివాస్, ప్రభాకర్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

ప్రొటోకాల్ విస్మరించిన అధికారులు



అభివృద్ధి పనుల శిలాఫలకం

హుస్నాబాద్: 'మన ఊరు–మన బడి' కార్యక్రమంలో భాగంగా హుస్నాబాద్ పట్టణంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో రూ.10లక్షల వ్యయంతో అభివృద్ధి చేసిన పలు వసతులను ఎమ్మెల్యే సతీశ్‌కుమార్ ప్రారంభించారు. అభివృద్ధి కార్యక్రమాలకు సంబంధించిన శిలాఫలకంలో అధికారులు ప్రొటోకాల్‌ను విస్మరించి అవమానపర్చారని పలువురు ఆవేదన వ్యక్తం చేశారు. పాఠశాల విద్యా కమిటీ చైర్మన్‌తో పాటు, పాఠశాల హెచ్ఎం పేర్లు శిలాఫలకంలో చేర్చకపోవడంతో అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. విద్యాశాఖకు, ప్రజలతో ఎలాంటి సంబంధం లేని వ్యక్తుల పేర్లను శిలాఫలకంలో చేర్చి, పాఠశాలను నడిపించే వారి పేర్లను చేర్చకపోవడం వారిని అవమానపర్చినట్లేనని వాపోతున్నారు. చివరకు డీఈఓ పేరు లేకపోవడం గమనార్హం.

విశ్వకర్మ వికాస్ యోజనతో కులవృత్తులకు ఆదరణ



మాట్లాడుతున్న విశ్వకర్మ సంఘం నాయకులు

హుస్నాబాద్: ఆల్ ఇండియా విశ్వకర్మ పరిషత్, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్ర విశ్వకర్మ యువజన హక్కుల పోరాట సమితి ఆధ్వర్యంలో గురువారం పట్టణంలోని అంబేడ్కర్ చౌరస్తాలో ప్రధాని నరేంద్ర మోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘాల నాయకులు మాట్లాడుతూ.. అభివృద్ధికి అమడ దూరంలో ఉన్న విశ్వబ్రహ్మణ పంచవృత్తులను అనాధిగా పట్టించుకోవడం లేదన్నారు. ఈ నేపథ్యంలో పార్లమెంట్ 2023–24 బడ్జెట్ సమావేశంలో ప్రధాని మోదీ నేతృత్వంలో కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్ ద్వారా ప్రధాన మంత్రి విశ్వకర్మ కౌశల్ సమ్మాన్ వికాస్ యోజన పథకం ప్రవేశపెట్టిన ఘనత కేంద్ర ప్రభుత్వానికే దక్కిందన్నారు. పథకంతో ఆర్థిక స్వావలంబన కలుగుతుందన్నారు. కార్యక్రమంలో ఏబీవీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి కందారపు రమేశాచార్యులు, బీజేపీ అక్కన్నపేట మండల అధ్యక్షుడు వీరాచారి, నాయకులు సతీష్, చంద్రమౌళి, రవీంద్రాచారి, సదానందం, వెంకట్రాజం తదితరులు ఉన్నారు.

ప్రజా సమస్యలు ఎత్తిచూపేందుకే పాదయాత్ర

కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి శ్రీనివాస్‌రెడ్డి



శ్రీనివాస్‌రెడ్డితో పాదయాత్రలో టీపీసీసీ కార్యదర్శి హరికృష్ణ

తొగుట(దుబ్బాక): దుబ్బాక నియోజకవర్గంలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను ఎత్తి చూపడానికే పాదయాత్ర చేపట్టామని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి చెరుకు శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. హాత్ సే హాత్ జోడో పాదయాత్ర మండలంలో రెండో రోజుకు చేరింది. గురువారం మండలంలోని బండారుపల్లి, మెట్టు, ఘనపురం గ్రామాల్లో ఇంటింటికీ వెళ్లి వృద్ధులు, యువకులను ఆప్యాయంగా పలకరిస్తూ వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ ప్రజలకిచ్చిన హామీలను విస్మరించి మాయమాటలతో ప్రజలను మభ్యపెడుతోందని విమర్శించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను గద్దెదింపడం ఖాయమన్నారు. కార్యక్రమంలో టీపీసీసీ కార్యదర్శి పూజల హరికృష్ణ, ఫిషర్‌మెన్ రాష్ట్ర కార్యదర్శి తిరుపతి, ఐఎన్‌టీయూసీ దుబ్బాక అధ్యక్షుడు బాలమల్లు, పార్టీ మండల అధ్యక్షుడు స్వామి, మాజీ ఎంపీపీ ఉపాధ్యక్షుడు మహిపాల్‌రెడ్డి, తుక్కాపూర్ మాజీ సర్పంచ్ విజయ్‌రెడ్డి, శ్రీనాకర్‌రెడ్డి, నాయకులు నరేందర్‌రెడ్డి ఆయా గ్రామాల నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

'గ్రామాల అభివృద్ధిలో రాజకీయాలు వద్దు'

దుబ్బాక: గ్రామాల అభివృద్ధిలో రాజకీయాలు వద్దని రాయపోల్ మండల బీజేపీ అధ్యక్షుడు మాదాసు వెంకట్‌గౌడ్ అన్నారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. దుబ్బాక ఎమ్మెల్యే రఘునందన్‌రావు ఢిల్లీలో వివిధ శాఖల కేంద్ర మంత్రులను కలిసి దుబ్బాక అభివృద్ధికి సహకరించాలని కోరడంతో కేంద్రం నిధులు మంజూరు చేసిందన్నారు. కానీ బీఆర్ఎస్ నాయకులు రాష్ట్ర ప్రభుత్వం నిధులు మంజూరు చేసిందని ప్రచారం చేయడం విడ్డూరంగా ఉందన్నారు. తప్పుడు ప్రచారాలు చేస్తే సహించేది లేదని హెచ్చరించారు.

సీఎంఆర్ఎఫ్ పేదలకు వరం

దుబ్బాక: సీఎంఆర్ఎఫ్ నిరుపేదలకు వరమని కౌన్సిలర్ యాదగిరి అన్నారు. పట్టణంలోని 14వ వార్డుకు చెందిన అజ్జ మధు ఇటీవల అనారోగ్యానికి గురికాగా సీఎంఆర్ఎఫ్ పథకం కింద మంజూరైన రూ.40వేల చెక్కును కౌన్సిలర్ గురువారం బాధితుడికి అందజేశారు.

మంత్రి ఎర్రబెల్లిని కలిసిన బేగంపేట గ్రామస్తులు



మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావుతో గ్రామస్తులు

మిరుదొడ్డి(దుబ్బాక): అక్బర్‌పేట–భూంపల్లి మండల కేంద్రం నుంచి గుర్రాలపల్లి వరకు బీటీరోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని కోరుతూ పంచాయతీరాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావును గురువారం హైదరాబాద్‌లో మార్యాదపూర్వకంగా గ్రామస్తులతో కలిసి విన్నవించినట్లు డీసీసీబీ డైరెక్టర్ బక్కి వెంకటయ్య తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ.. బీటీ రోడ్డు నిర్మాణానికి మంత్రి సానుకూలాంగా స్పందించినట్లు తెలిపారు. అనంతరం ఇదే విషయంపై రాష్ట్ర పంచాయతీ రూరల్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ సంజీవరావును కలిసి విన్నవించినట్లు తెలిపారు. మంత్రిని కలిసిన వారిలో దుబ్బాక ఆత్మ కమిటీ మెంబర్ రమేశ్, గ్రామస్తులు ఉన్నారు.